క్లుప్తంగా

తాగునీటి సమస్య రానివ్వొద్దు



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న చైర్మన్ జైపాల్

వైరా: వేసవిలో వైరా మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా అన్నిచర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించడమే కాక పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు, ఏఈ అనిత, జేఏఓ స్వప్న, టీపీఎస్ ప్రశాంత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, భీమవరం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో గురువారం సాయిబాబాకు అర్చకులు సాంప్రదాబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయినాధునికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. ఎర్రుపాలెంలోని బాబా ఆలయంలో హైద్రాబాద్‌కు చెందిన ఎన్ అంకితరెడ్డి - నిరోషా దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'విజయ'లో ముగిసిన టాస్క్ శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ డెవలప్‌మెంట్ (టాస్క్) వారి ఆధ్వర్యంలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. టాస్క్ రిసోర్స్ పర్సన్ వి.రాకేష్ రెడ్డి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎకడామిక్ డైరెక్టర్ చిన్నయ్య, ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఫరీద్‌బాబా, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

ముదిగొండ: ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శిరీష అన్నారు. ముదిగొండలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే వారిపై కేసు నమోదు చేసి, పట్టుపడ్డ ట్రాక్టర్లను నెల రోజుల వరకు సీజ్ చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు. అనుమతితోనే ఇసుక తరలించాలని అక్రమ రవాణాకు పాల్పడే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

సత్తుపల్లిరూరల్: చీమలపాడులో పేలుళ్లలో మృతి చెందిన, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాదిగ అన్నారు. ఈ పేలుళ్లకు కారణమైన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ మండల నాయకులు పరిగడుపు లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు తాళ్ల అర్జున్, జనపాటి అశోక్, గంధం రాఘవ, సింగపోగు రాంబాబు, తగరం మేరీ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్‌ల సంబరాలు

వైరారూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సంబరాలు జరుపుకున్నారు. తాము నాలుగు సంవత్సరాల ప్రోహిబిషన్ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ జ్యోత్స్నదేవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు గరికపాటి కుమార్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరిస్తూ జీఓను విడుదల చేయడమే కాకుండా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ అనురాధ, కార్యదర్శులు రాధాకృష్ణ, రామకృష్ణ, అబ్దుల్ రహీం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల దందా



- రైతుల దగ్గర ధాన్యం కొని కేంద్రాలకు విక్రయానికి ఏర్పాట్లు
- తూకాలు, ధరల్లోనూ భారీ వ్యత్యాసం
- నష్టపోతున్న అన్నదాతలు

ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

కల్లూరు రూరల్: ధాన్యం రైతులను దళారులు నిలువునా దోపిడి చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చేసిన ప్రకటనలు ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో ధాన్యం వ్యాపారులు రైతుల కల్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కల్లూరు మండలంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో 33 వేల ఎకరాల్లో యాసంగి వరిపంట సాగుచేశారు. దొడ్డురకాలైన ఎంటీయూ1010, ఎంటీయూ1001, ఎంటీయూ1060, రకం ధాన్యాన్ని పండించారు. లింగాల, వాచ్యాతాండ, బోడిమెల్లె, చంద్రుపట్ల, ఎర్రబోయినపల్లి, చెన్నూరు, వైఎస్‌పురం, రఘునాధగూడెం, ముచ్చవరం గ్రామాల్లో వరికోతలు ప్రారంభమైనాయి. ముఖ్యంగా బోర్లు, బావులు, చెరువులు, ఆయకట్టులో సాగుచేసిన ధాన్యం పంట ముందుగా కోతకొచ్చింది. మిగిలిన గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యాన్ని అదునుగా చేసుకున్న వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లను ముందస్తుగా ప్రారంభించారు. రేటు తక్కువని తెలిసినా కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తప్పని పరిస్థితిలో విక్రయిస్తున్నారు. సత్వరమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కల్లాల్లోనే విక్రయాలు..

వ్యాపారులు రైతు కల్లాలోనే పచ్చి ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,040లు ప్రకటించింది. ప్రభుత్వ సొసైటీలు, ఐకేపీ, డీసీఎంఎస్‌ల ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఈ సీజన్‌లో కొనుగోళ్లలో జాప్యం కారణంగా ప్రైవేట్ వ్యాపారులు కల్లాల్లోనే పచ్చి ధాన్యన్ని 78 కిలోల బస్తాకు రూ.1,150లు చెల్లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అన్నదాతలు ఈ యాసంగిలో కోట్లాది రూపాలయలు నష్టపోతున్నారు.

నిల్వసౌకర్యం లేకనే..



గ్రామాల్లో పండిన ధాన్యం నిల్వ చేసేందుకు సరైన వసతి సౌకర్యాలు లేవు. కల్లాల్లో ఉన్న ధాన్యం ఇంటికి తెచ్చి ఎక్కడ నిల్వచేయాలో తెలియక కల్లాల్లో అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉండేది.

– సాయిని రామారావు, రైతు, పుల్లయ్య బంజరు

మిల్లర్లకు విక్రయిస్తున్నాం..



ముందుగా కోతకు వచ్చిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నాం. సాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న వరి పంట ఇంకా కోతకు రాలేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలో ఏర్పాటు చేయకపోవడంతో కలాల్లో ఉన్న ధాన్యం ప్రైవేట్ వ్యాపారులకు, మిల్లర్లకు అమ్ముతున్నాం.

– మండెపుడి బసవయ్య, రైతు, లోకవరం

బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి



బోనకల్: టీఎస్‌యూటీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకుడు బాబు

వేంసూరు/తల్లాడ/బోనకల్/ఎర్రుపాలెం: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నిర్మల కుమారి, మండల అధ్యక్ష, కార్యదర్శులు పర్మానాయక్, బొల్లె పోగు సుధాకర్, బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అన్నారు. గురువారం వేంసూరు ప్రాథమిక పాఠశాలలో, తల్లాడ, బోనకల్ మండల కేంద్రలో, ఎర్రుపలెంలో మీనవోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భవ వేడుకలు నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకై క సంఘం ఒక్క టీఎస్‌యూటీఎఫ్ మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 2 వేల హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్షణమే వాటిని భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఈశ్వారాచారి, ప్రీతం, రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, యాకుబ్ అలీ, భాస్కర్‌రావు, రవి కుమార్, రామశేషు, మురళీకృష్ణ, శ్రీకాంత్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, సునీత, దాసు, రఫీ, సద్దాబాబు, చంద్రప్రసాద్, రమేష్, గోపాలరావు, నర్సింహారావు, లక్ష్మి, రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాబీరాబేగం, అజయ్ కుమార్, సైదారావు, రాజారావు, చిన్ని, వెంకటకృష్ణ, శ్రీనివాస్, పాండు, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి శస్త్ర చికిత్సలు చేసిన వారితో లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేటర్‌విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం 10 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. కొత్తగూడెంకు చెందిన 5 మందికి ఖమ్మంకు చెందిన 5 మందికి వైరా లయన్స్‌క్లబ్ ఆస్పత్రిలో కంటి శుక్లాలకు సంబంధించిన చికిత్సలు చేశారు. అనంతరం వారికి పాలు, పండ్లు అందించారు. కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్ రావు, గంగవరపు కిషన్, ఉంద్రు వరలక్ష్మి, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ రవి చంద్ర, ఉయ్యూరి రామకృష్ణ, గోపి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి..

ముదిగొండ: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ అన్నారు. మండలంలోని చిరుమర్రిలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు నిరుపేదలకు వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యాధికారిణి అరుణజ్యోతి, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సత్తుపల్లి: పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు, ఉస్మానియా యూనివర్సిటీ అరుణతర కామ్రేడ్ జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ తెలిపారు. గురువారం సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ జార్జిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలోనే ఫిజిక్స్‌లో మొదట గోల్డ్‌మెడల్ సాధించిన గొప్ప వ్యక్తి అని, విద్యార్థుల సమస్యలపై అనేక ఉద్యమాలను నిర్మించిన వ్యకి జార్జిరెడ్డి అని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020కి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నియోజకవర్గ నాయకులు మౌనిక, సాగరిక, నవ్య, అంజలి, రాహుల్, యశ్వంత్, గణేష్, ప్రసాద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మధిర: మధిర – తొండల గోపవరం రైల్వేస్టేషన్ల మధ్య గురువారం గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎగువ లైన్‌లో ఛండీగఢ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు కిందపడి సదరు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఈనెల 12న రాజమండ్రి నుంచి తెనాలి వరకు, 13న విజయవాడ నుంచి తెనాలి వరకు రైల్వే టికెట్లు లభించాయని మధిర రైల్వే హెడ్ కానిస్టేబల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి గాయాలు

ఏన్కూరు: మండల కేంద్రంలో ఈనెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడగా గురువారం కేసు నమోదైంది. ఏన్కూరుకు చెందిన దాసరి వెంకటేశ్వర్లు ఈనెల 9న రహదారి వెంట వెళ్తుండగా కొత్తగూడెంకు చెందిన కె.వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆయనను ఢీకొట్టాడు. ఈ ఘటనలో దాసరి వెంకటేశ్వర్లు కాలు విరగగా ఆస్పత్రి చేర్పించారు. ఆయన కుమారుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. అలాగే, మండలంలోని కోదండరామాపురం తండాలో ఈనెల 12న బానోతు బుజ్జీ, బానోతు కమ్లి నడుమ ఘర్షణ జరగగా బుజ్జికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

చింతకాని: మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నించిన ఘటన మండలంలోని నాగులవంచలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆలస్యం భారతమ్మ బ్యాంక్ వద్ద నుంచి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఆమెను అనుసరించాడు. ఆమె ఇంట్లోకి రాగాగే మెడలోని గొలుసును లాక్కునే ప్రయత్నం చేయగా ఆమె కేకలు వేసింది. ఈ క్రమంలో ఆమె చెతికి ఉన్న బంగారపు ఉంగరంతో పాటు ఆమె వద్ద ఉన్న పర్సును కూడా లాక్కొని పారిపోయారు. పర్సులో రూ.300 నగదు ఉన్నాయి. భారతమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

అంబేడ్కర్ జీవితంపై అవగాహన

సత్తుపల్లిరూరల్: ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంపై అవగాహన పెంచుకోవాలని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని గురువారం పాఠశాలలో అంబేడ్కర్ జీవిత విశేషాల గురించి చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఓఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఎర్రుపాలెం: సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) సెట్ పరీక్షలో మండలంలోని భీమవరం, మీనవోలు విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక గురుకుల పాఠశాలలో కోట రత్నరోహి, మీనవోలులోని శ్రీబాస్కర మెమోరియల్ పాఠశాలలో పారా మధు పదో తరగతి చదివారు. వీరు హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి ఐఐటీ కళాశాలలో సీట్లు సాధించారు. ఇద్దరి విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కమల్‌రాజు పరామర్శ

చింతకాని: మండలంలోని చినమండవ గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గురువారం పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన తూమాటి పెద్దవెంకటరెడ్డి, కాశిమాల భారతమ్మ కుటుంబ సభ్యులను, అనారోగ్యంతో బాధపడుతున్న కాశిమాల సుధాకర్‌ను కమల్‌రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుపతి కిషోర్, ఎంపీపీ పూర్ణయ్య, ఉపసర్పంచ్ వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ లచ్చయ్య, నాగులవంచ సొసైటీ డైరెక్టర్ లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

జర్మియాబాబుకు పలువురి నివాళి

కల్లూరు: ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు గొడిపేరు జర్మియాబాబు చిత్రపటం వద్ద పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కల్లూరు పట్టణం శాంతినగర్‌కు చెందిన పాస్టర్ జర్మియాబాబు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. గురువారం జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంబానీ చంద్రశేఖర్, డాక్టర్ మట్టా దయానంద్, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ రఘు, డాక్టర్ లక్కినేని రఘు, జిల్లా కమిటీ సభ్యుడు చందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాలెపు రామారావు, ప్రసాద్, ఏఐసీసీ, ఎన్‌సీసీ, టీసీసీ క్రైస్తవ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతిపై సంతాపం

కొణిజర్ల: మండలంలోని అనంతారానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నామా గురవయ్య(70) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద టీడీపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీకులకుడు కూరపాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం తదితరులు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ తడికమళ్ల దానియేలు, నాయకులు తాతా సుధాకర్‌రావు, గుత్తా సీతయ్య, వాడపల్లి భిక్షపతి, గుడిపూడి నాగేశ్వరరావు, దామా శ్రీనివాసరావు, ఎలనాటి లక్ష్మణరావు, రచ్చ సత్యనారాయణ, రామ మల్లయ్య, నగేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

- సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య
- బస్వాపురంలో విగ్రహావిష్కరణ



తల్లాడ : అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య

తల్లాడ: ప్రపంచ మేధావి, భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ అందరివాడని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడ మండలం బస్వాపురంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ సూరంపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ..

పవిత్ర రంజాన్ పండగను ప్రతీ ముస్లిం సంతోషంగా జరుపుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన తల్లాడ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లాడ, అన్నారుగూడెం ముస్లింలకు ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం అంబేడ్కర్ సంక్షేమ సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు, జెడ్పీటీసీ ప్రమీల, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డితో పాటు తాతా భాస్కర్‌రావు, దాసురావు, వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, నరసింహారావు, చిన్న కృష్ణ, ఉదయ్, కిరణ్, వెంకటనరసింహారావు, కోటిరెడ్డి, దూపాటి భద్రరాజు, డి.వెంకట్‌లాల్, రాధిక, శ్రీనివాస్, దాసురావు, డి.నరేష్‌రాజు, మోదుగు ఆశీర్వాదం, సుదర్శన్, రవి, ప్రసాద్, బాబు, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో అంబేడ్కర్ ఆడిటోరియం..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో బీఆర్.అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే ఏడాదికల్లా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఉపాధ్యాయుడు థామస్, సూపరింటెంట్ కుమారి దంపతుల ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి సందర్భంగా జ్ఞానదీపిక పోటీలు నిర్వహించగా, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. అనంతరం ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి ఎమ్మెల్యే రూ.20వేలు నగదు బహుమతి అందించారు. ఎంపీపీ దొడ్డా హైమావతి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎండీఓ సీహెచ్.సుభాషిణి, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసుతో పాటు రత్నాకర్, నర్సయ్య, ప్రసాద్, కరుణాకర్, ఏసురత్నం పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో దయానంద్, తదితరులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని జామే మసీద్‌లో రంజాన్ సందర్భంగా గురువారం రాత్రి ముస్లింలకు డాక్టర్ మట్టా దయానంద్ ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. సదర్ ముఖరం హుస్సేన్, మందపాటి ముత్తారెడ్డి, ఎం.డీ.కమాల్ పాషా, ఎండీ.ఫక్రుద్దీన్, యూనిస్, ముస్తఫా, దూదిపాల రాంబాబు, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు..

పట్టణంలోని పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ ఆధ్వర్యాన గురువారం ముందస్తు రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సేమియా అందించారు. రంజాన్ ఉపవాసం చేస్తున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు మహ్మద్‌లాల్ అహ్మద్ ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో రత్నాకర్, వెంకటేశ్వరరావు, ముబీన, నాగమణి, జయశ్రీ, పవన్, నర్సింహారావు పాల్గొన్నారు.

జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో..

కల్లూరు: కల్లూరు ఎన్నెస్పీలోని కౌసర్ మసీదులో గురువారం రాత్రి జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ అన్వర్ మాట్లాడారు. పవిత్ర రంజాన్ పండుగ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఎంపీడీఓ రవికుమార్, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, ముస్లీం మండల కమిటీ అధ్యక్షుడు అలీ, జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి వెంటే మేమంతా..

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ముత్తారెడ్డి, నాయకులు

సత్తుపల్లి: మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్ణయం ప్రకారమే తాము నడుచుకుంటామని గౌరిగూడెం సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి, కౌన్సిలర్ దూదిపాల రాంబాబు, మల్లిరెడ్డి మురళీరెడ్డి, మందపాటి రవీందర్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని గౌరిగూడెం లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లుగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ముత్తారెడ్డి తదితరులు మాట్లాడుతూ అన్ని ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ పార్టీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉపయోగించుకుని ఆయనకు ఇచ్చిన హామీలను విస్మరించిందని తెలిపారు. దీనికి తోడు ఆయనకు ఉన్న ప్రజాభిమానాన్ని తట్టుకోలేక పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. కాగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించే స్థాయి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు లేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సండ్ర ఏం చేశారో చెప్పాలని సూచించారు. ఏదిఏమైనా ఉమ్మడి జిల్లాలో పది స్థానాల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన అభ్యర్థులను గెలుపించుకుంటామని స్పష్టం చేశారు. తుంబూరు సొసైటీ ఉపాధ్యక్షుడు కాలినేని రాజేష్‌తో పాటు ఎం.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, తోట గణేష్, కర్లపూడి రామారావు, కొత్తూరు కోటేశ్వరరావు, మానస నాని, వెంకటరెడ్డి, ఎం.డీ.కమల్ పాషా, పుసులూరి హన్మంతు, మారుతి బాబురావు, వి.హరికృష్ణారెడ్డి, షాకీర్, యూనిస్, సిద్దినబోయిన సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం



అసంపూర్తిగా నిలిచిన రోడ్డు

కల్లూరు రూరల్: మండలంలోని చెన్నూరు నుంచి రంగాపురం వరకు నిర్మించిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిపివేశారు. 5కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులతో 5కిలో మిటర్లకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను 2022 సంవత్సరంలో రెండు గ్రామాల్లో ఒకేసారి ప్రారంభించారు. ఈ క్రమంలో రైతులు రోడ్డుకు రెండు వైపులా ఉన్న పంట పొలాలకు నీటి సరఫరా కొరకు పైపలు వేసుకుంటామని తెలపడంతో కాంట్రాక్టర్ సుమారు 20 మీటర్లు మేర రోడ్డు వేయకుండా వదిలేశారు. ఏడాది కావస్తున్నపటికీ నేటికీ రైతులు పైపులు వేయలేదు.. కాంట్రాక్టర్ రోడ్డు వేయలేదు. రెండు గ్రామాల మధ్య రోడ్డు పనులు సంగంలోనే నిలిపివేయండతో ఆయా గ్రామల ప్రజలు అసౌకర్యానికి గురై నిరసన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. కావున కాంట్రాక్టర్ త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వాహనదారులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్

గుంతను పూడ్చరా..?



ఎర్రుపాలెం మండలంలోని రింగ్ సెంటర్ నుంచి జయంతి రోడ్డు వెంబడి మిషన్ భగీరథ పైపు లైను(పంచాయతీ) గత కొన్ని నెలల క్రితం లీకయింది. ఈ పైపుకు లైన్‌కు మరమ్మతులు చేసేందుకు గానూ రెండు నెలల క్రితం పంచాయతీ వర్కర్లు గుంత తీశారు. కానీ నేటి వరకు పైపు లైన్‌కు మరమ్మతు చేయలేదు. గుంత పూడ్చలేదు. దీంతో తాగునీరు వృథాగా పోతుంది. రోడ్డులో ప్రయాణించడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతే కాక నిలిచిన నీరు దోమలకు నివాసంగా మారింది. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. - ఎర్రుపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : ఎన్.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, ఎర్రుపాలెం
సెల్ నంబర్ : 9849964248